# చిన్ని

## 1

జన్మతోనే సంక్రమించిన ఇష్టాయిష్టాలు బుద్ధిప్రవర్తనల మల్లేనే స్వార్థంతో కూడిన అనుభవాలవల్ల కాని , దేశకాలపరిస్థితులవల్ల కాని మార్పు చెందవు. కొందఱికి ఇంగువంటే అయిష్టం. దీనికి కారణం వారు చెప్పలేరు. పైగా ఇంగువవున్న మంచిగుణాలను వర్ణించి మేలు కోరేవారెవరైనా దానిని తినేటట్టు చేయ ప్రయత్నించినపుడు దానిమీదుండే అసహ్యం యెక్కువవడం కూడా వుంటుంది. రంభామేనకలకి ఇంగువ చాలా యిష్టమంటే స్వర్గానికి కూడా వెళ్ళడానికిష్టపడని వ్యక్తులు వుండడం అరుదుకాదు. తనకిష్టముకాని వొకపదార్థం భార్యతినడం వొద్దని యెంతచెప్పినా వినకపోవడం చూచి వొకగ్రంథకర్త తనభార్యని హత్య గావించిన విషయం ఫ్రెంచివాఙ్మయ చరిత్రకారులు ముచ్చటైన వ్యాఖ్యానంతో చెప్పేకథలలో వొకటి.

కావలసిన వస్తువులను పొందటంలోకంటె అక్కరలేని వస్తువులను తన చుట్టుప్రక్కల లేకుండా చేసుకోవడం మానవుని ముఖ్యమైన ఆనందాలలో వొకటిగా తోస్తుంది. తనకి అక్కరలేని విషయాలు అసహ్యమైన వస్తువులను గురించి చెప్పడంలో ప్రతిమనిషి కొంచెం చెప్పరాని సౌఖ్యం అనుభవించి తీరుతాడు. అల్లాగే చక్రపాణి చాలాధనికుడైనా తన ఆనందం పూర్తిచేసుకొనేందుకు అతను కోరేవి చాలాతక్కువ. తన ధనాన్ని యెల్లా వ్యయం చెయ్యాలో- దానితో యేవేవి కొంటే తన జీవిత మాధుర్యం చిక్కనవుతుందో అతనికి తెలియదు. కాని అతనికి అసహ్యమైనవి చాలా వున్నాయి. గొళ్ళెంపడని తలుపులన్నా, తెరుచుకోని గొడుగులన్నా, కార్లల్లో తలుపు వేసేప్పుడయ్యే చప్పుడన్నా అతనికి చాలా మంట. ఇవంటే యెందుకు గిట్టదో అతను చెప్పగలడు. కాని, వీటన్నిటి మీద కంటే మించిన కుక్కలపై తనకుగల అసహ్యానికి చెప్పే కారణం చాలా విచిత్రమైనది. తనని కుక్కల్ని పెంచమని యెవరు బాధించారు? అతనుమాత్రం తనకు కుక్కలపైనున్న మంట భగవంతుడు

సృష్టిజాలంలో మానవునికి జంతువుకి కనపర్చిన తారతమ్యం, ఆ తారతమ్యంమీద ఆధారపడిన మానవుని ప్రాధాన్యతను సూచిస్తుందనుకుని గర్వపడేవాడు.

కార్యం జరిగింతర్వాత అత్తారింటికి వెళ్ళడం అదే అతనికి మొదటిమాటు రాత్రి భోజనాలయింతర్వాత భార్యతో గదిలో కూర్చుని ముచ్చటగా కబుర్లు చెప్పుకుంటున్నాడు. ఇంతలో భార్య 'గౌరీ' అని పిలవగానే తోకాడించుకుంటూ గౌరీ లోపలికి జొరబడి యజమానురాలి వొళ్ళో కెగిరి కూచుంది చక్రపాణి త్రుళ్ళిపడి తర్వాత కొంచెం సర్దుకుని "ఇదేమిటి? ఎవరిదీ కుక్క?" అని ప్రశ్నించాడు.

"ఎవరి దేమిటండి మనదే. నాది. చిన్నప్పుడు నాకు ముద్దొచ్చి మానాన్నని కొనమంటే కొన్నారు. కాదమ్మా, గౌరీ—" అని దాన్ని బుజ్జగిస్తూ దాని తోక తనచెవులో త్రిప్పుకుంటూ అల్లరిచేస్తూ మాట్లాడుతూ వుంది

"రాకరాక యీకుక్కే ముద్దురావాలి? నాకు కుక్కలంటే పరమ అసహ్యం యెరుగుదువా? కుక్క బుద్ధంటారు, తెలుసా? దానంత నీచమైన జంతువు ఇంకోటి లేదు. నీపుణ్యమాయిది దాన్నవతలికి తోసేద్దు."

"అంతా సోద్యమండి మీది మరీను. అమ్మో దీన్నొదిలి క్షణమైనా వుండగలనా? కార్యం మూడురోజులూ యెట్లా గడిపానో? ప్రతిరాత్రి నా గౌరి నా మంచంమీదనే పడుకుంటుందండి. దానికి నేనంటే అంతప్రాణం.. వెళ్ళమ్మా గౌరీ! ఆయనమీది కెళ్ళి ఆడుకోమ్మా" అని చక్రపాణిమీదికి వొదిలింది. ఈ వ్యక్తితో పరిచయం తప్పదన్నట్లుగా అది పాణిమీదికి దూకి తన ముందర కాళ్ళతో అతనిమెడ చుట్టపెట్టింది. దాన్ని ముందుకు గెంటి వొక్క తాపుతన్నాడు. అది యేడుపుమొహంతో మొరిగి మళ్ళా యజమానురాలిదగ్గఱ కెళ్ళింది. అతని పెండ్లానికి అతనిచర్య కోపం బోధపడలేదు.

"ఈ కుక్కని మాయింటికికూడా తీసుకొస్తావా యేమిటి గోల? అవుతే మనం విడాకులు పుచ్చుకోవలసిందే."

"పోనీ పుచ్చుకుని కుక్కలంటే యిష్టంలేని భార్యని మళ్ళా పెండ్లి చేసుకోండి."

సంభాషణ ప్రమాదకరంగా మారి భార్య మనస్సుకి నొప్పి కలుగుతుందన్న వుద్దేశంతో-

"కుక్కకి సాధారణంగా ఆయు వెంత?" అన్నాడు.

"మరేం, బెంగెట్టుకోకండి దాని ఆయువు కొంచెమే. అదో నేనో తొందరగానే కాలం చేస్తాము."

ఈ మాటలు పాణికి చాలా బాధకలిగించాయి. ఈ కుక్క విషయంలో తప్ప మిగతావాటిల్లో దంపతుల అన్యోన్యం యెంతవరకూ వుండగలదో అంతవరకూ వారిరువురకు వుంది. పోని "గౌరి"ని అతనుకూడ సహించటం నేర్చుకుంటే వారిజీవితం యెంత శాంతివంతంగా వుంటుందో అతను వూహించుకున్నాడు.

"అది కాదు, రాజ్యం! దానితో ముద్దులాట లెందుకన్నా గాని,.... దాన్ని తరిమెయ్య మన్నానా? గౌరీ.... రామ్మా...." అంటూ తనుకూడా దాన్ని బుజ్జగించాడు. గౌరి యిరువురిమధ్య నుంచుని వారిబుగ్గలు నాకుతూ వారి నవ్వులకు, స్వార్థంతో నిమిత్తంలేని తీయని సంభాషణలకు కారణమైంది.

## 2

రెండుసంవత్సరాలు గడిచింతర్వాత చక్రపాణికి మొగపిల్లవాడు జన్మించాడు. కాని ఆ శిశువు పుట్టినప్పటినుండి తల్లి మంచమెక్కింది. మొదట ముట్లుపోవడంతో ఆరంభమయి చివరికి క్షయగా మారింది. రోజు రోజుకూ క్షీణించి పోతోంది. మందులకోసం పాణి సంచీలు గుమ్మరిస్తున్నాడు.

ఒక సాయంత్రం బైట పెద్దవాన కురుస్తుంటే రాజ్యం భర్తని పిలిచింది. పాణితలను ఆమె హస్తాలలో తీసుకొని రొమ్ముపై ఆనించుకుని యేడవడం మొదలెట్టింది."

"నాకు జబ్బుచేసింతర్వాత గౌరికి అన్నం సరిగ్గా పెడుతున్నారా?" అంది.

"రాజ్యం ఆ విషయంలో బెంగపడవద్దు. నీతో సమానంగానే దాన్ని ప్రేమిస్తున్నాను...."

"నేను పోయింతర్వాత కూడా దాన్నలాగే చూడాలి సుమండీ" పాణికూడా కళ్ళమ్మట నీళ్ళు కార్చటం సాగించాడు.

"అట్లాంటి మాటలు అనకు. నువ్వుపోతే నేనొక్కర్తే జీవించ గలనా?...."

"ఇవన్నీ వొట్టిమాటలండి. ఐనాసరే మీకు నిజంగా నాపై అంత అనురాగం వుంది.... కాని, పిల్లాడు, గౌరీ.... వీళ్ళకోసమైనా మీరు జీవించితీరాలి.... చేతులో చెయ్యి వెయ్యండి" అని మెల్లిగా తనచెయ్యి యెత్తింది; అతను ప్రమాణం చేశాడు.

"పెండ్లి చేసుకుంటారా....?"

పాణి యేడ్పు కట్టలేకపోయాడు.

"చేసుకోను.... నీతోడు.... దైవంతోడు...."

ఇద్దరు యేడుస్తోంటే గాలిహోరుకి తలుపులు తెరవబడతాయి. ప్రపంచంమీద ఆగ్రహం వొచ్చినట్లుగా గౌరి మొరుగుతుంది. గౌరికంఠం రాజ్యం వినడం ఆఖరుసారి అదే.

## 3

ఒక సంవత్సరం గడిచింది. ఆరోజున చక్రపాణి గౌరిని సబ్బుతో కడిగి తుడుస్తుండగా తన చిరకాలస్నేహితుడు వర్మ ప్రవేశించాడు. బి. ఏ. లో ఇతని గ్రూపు ఫిలాసఫీ కావడంవల్ల కొందఱు యితనిని వేదాంతం వర్మ అని పిలుస్తారు. మరికొందరు మిత్రులు పరిహాసంగా "(Good bye) గుడ్ బై వర్మ" అని కూడా వ్యవహరిస్తూంటారు. వర్మ పాశ్చాత్యదేశీయుల భావాలు, అనుభవాలు సంఘం కట్టుబాట్లు సగంసగం అర్థం చేసుకొని ప్రజలలో కలకలంచేసే అపాయకరవ్యక్తులలో వొకడు. ఇతనికి గుడ్ బై వర్మ అనే బిరుదు రావడానికి సనాతనధర్మానికి, పూర్వాచారపరాయణత్వానికి, దేముడున్నాడన్న సిద్ధాంతానికి గుడ్ బై (నమస్కారం) చేసి వెన్ను త్రిప్పడమే కారణం. భావంలో మాట యెల్లావున్నా కాని క్రియలో మాత్రం నవీనత్వానికి నాగరికతకి ఆకారం, వాక్కూ వొస్తే

అవి వర్మగా మారతాయనడంలో ఇతనివి వర్ణించడానికి ప్రయత్నం చెయ్యడ మన్నమాట ఇతడు తెలుసుకొన్న సిద్ధాంతాలు కొన్నియివి.

దైవం లేడు. న్యాయమైన దైవాన్ని సృష్టించడం మానవుడు చేసిన మహోన్నతమైన కార్యం.

పాపపుణ్యాలు లేవు. పాపం చెడ్డదని తెలిస్తే అనాదినుండి పాపాలు చేయడం యెందుకు మానలేదు? అందులో యేదో మంచి వుందన్నమాట. కాబట్టి అది పాపంకాదు.

ప్రేమ అనేది వ్యక్తి కల్పితం: వివాహం సంఘ కల్పితం ఎన్ని పేర్లతో వ్యవహరించినా సంభోగసుఖాలలో జంతువులకు, మానవులకు యేలాంటి భేదామూ లేదు.

ఇల్లాంటి వెన్నో చాలా వున్నాయి తన వుద్దేశాలను బలపరిచేం దుకు గాను నీటజే (Neitzsehe, షా (Shaw), ఇబ్సెన్ (Ibsen) మొదలగు పాశ్చాత్యవేదాంతులు చెప్పిన వాక్యాలను, తనకు అను గుణ్యంగా మార్చి కనిపించిన ప్రతివానికి బోధ చేస్తోవుంటాడు. కొంచెం బీదవాడైనా చాలా సరదాపురుషుడు. ఇతనితో సంభాషిస్తే జీవితంమీద విముఖత్వం చెందినవారికి సహితం జీవామృతం సేవించినట్లుగా వుత్సాహం, అహ్లాదం కలుగుతాయి.

“హల్లో! పాణి! ఏమిటోయ్-ఊరకుక్కని సంపాయించావ్. ఏడేనా రోమాన్సుకి వుపయోగపడుతుందనా యేమిటి? మరిచాను. నీభార్య పోయిం దిటగా. బ్రతికావ్, పో; మాడ్పు ఆరిపోయిన వొత్తిని వెలిగిస్తుందన్నాడు... ఓ కవిగాడు.”

“అవునా. ఇది నాభార్య పెట్ (Pet: పెంపుడు) కుక్క: దీనిపేరు గారీ.”

“సరే, డవురీ (Dowry: కట్నం`కి బదులు గారీని అప్పగించి పోయిందా....దానికేం గాని, ముహూర్తం యెప్పుడు పెట్టించావ్.” అని సిగరెట్ ముట్టించాడు.

“నీ వేళాకోళానికి కేం గాని.... నా భార్యలాంటి....”

“అవుతే నాను తేలికడుగుతాను... చచ్చి యేడాదవుతే యింకా “నా

భార్య" యేమిట్రా? ఉన్న నాలుగురోజులూను. తరవాత యెవరికి వారే యమునా తీరే.... ఏమంటుంది మీ గౌరీ...." అని అగ్గిపెట్టితో కుక్కని కొడతాడు. అది అతనికేసి మొరుగుతూ మీదికి దూకబోతుంటే పాణి వారిస్తాడు.

"మళ్ళా పెళ్ళికి నామనస్సు వొప్పడం లేదురా, వర్మా! పైగా నా భార్యకి వాగ్దానంకూడా చేశాను...." అని జరిగిపోయిన దృశ్యాలు స్మరించుకుంటూ చక్రపాణి మౌనం తాలుస్తాడు.

"నాన్‌సెన్సు మనస్సేమిటి మనస్సుకి గుడ్‌బై కొట్టు. సెంటిమెంటల్ కావద్దు. మన హిందువులలో వుండే గొప్పలోటే యిది. చూడు షెల్లీ విషయంచూడు. గొప్పకవి. ప్రేమనుగురించి అమోఘంగా వ్రాశాడు. అవుతేం? పదిహేనేళ్ళప్పుడు దేముడు లేడు అన్న పుస్తకం వ్రాశాడు. తండ్రి కోపించాడు. తండ్రికి గుడ్‌బై కొట్టి ఛీకరోడ్ అన్నాడు. అల్లా వుండాలి మనవాళ్ళు అన్నా తమ్ముడూ అని, మొగుడూ పెండ్లాం అని అంతా కట్టుకుపోయేటట్టు పూసుకు తిరుగుతారు. మళ్ళా వొకళ్ళని చూస్తే వొకళ్ళకి గిట్టదు—"

"నా అంతరాత్మ వొప్పడం లేదురా" అన్నాడు పాణి ముభావంగా.

"దానికి గుడ్‌బై కొట్టాలి. అసలు మనకి ప్రేమ అనేది బ్రతికున్నప్పుడేనా వుందా యేమిటి? అవసరమున్న నాలుగురోజులు ఇల్లు—వొదలివెళ్ళేప్పుడు యెట్లా వుంటుంది మనస్సు అంతే మనుష్యులతో కూడా అంతే ఈమధ్యనే డార్విన్ శాస్త్రజ్ఞుడు మనుష్యుని పూర్వీకులు కోతులని ఋజువుచేశాడు. అల్లాంటి పక్షాన స్త్రీలు అందమైన తోకగల కోతులై వుంటారు...." అని విరగబడి నవ్వుతాడు.

"నిజమేలే.... కాకపోయినా పిల్లాడి పోషనార్థకమైన పెండ్లాముంటే మంచిదని తోస్తుంది...."

అల్లాగ దోవలోకి రా.... మా అత్తగారివూళ్ళో ఒక రంభ వుందిరా. ఎఫ్. ఎ. ఫేలయింది అంటే చేతకాక ఫేల్‌కాలేదు. ఇప్పుడు ప్యాస్ అయిన వాళ్ళకంటే తీసిపోదు. ప్యాసయినవాళ్ళు పేపర్లలో తాము స్త్రీలము

అవి యుక్తిగా తెలియపరుచుకున్నారు.... పేరు కల్యాణి. నీ అమాయకత్వానికి, దావిఛలాకీకి సరిపోతుంది."

'అవులే నువ్వు చూశావా ఆపిల్లని?" వర్మ సమాధానం కొంచెం సంకోచంతో చెప్పాడు.

"చెప్పుకోడం అంటే....ఒకటిరెండుసార్లు యేదోవారగా చూసినట్లు గుర్తు. ఇన్నెందుకు సబితాదేవి కళ్ళు దేవికారాణి...."

"సరే, నీవర్ణనలకేం గాని- చదువుకున్న స్త్రీ సరిగ్గా వుంటుందంటావా?" చక్రపాణి బి. ఏ దాకా చదువుకున్నా తను నేర్చుకున్న విద్య, సహజజీవనానికి అన్వయించకపోవడం చూచి పాశ్చాత్య విద్యావిధానంలో అతనికి విశ్వాసం తప్పిపోయింది. అప్పుడప్పుడు కాలేజీలో చదువుకున్న ఆడపిల్లలను చూచి వాళ్ళని పెండ్లి చేసుకుంటే యెంతసరదాగా వుంటుందో ననుకునేవాడు. ఇప్పుడు వర్మ తనముందు చదివిన నాగరికత గ్రంథం విన్న తర్వాత ఆ స్వరూపంలేని భ్రాంతి మళ్ళా రూపం దాల్చింది.

"సరీగా వుండడమేమిటి? చచ్చేవరకు స్త్రీలు మనలాగే బ్రతికే వుంటారు, పోనీ మనం సరిగా వుండి చస్తున్నాం గనుకనా. ప్రతీది మన దృష్టి, యాటిట్యూడ్‌లో వుంది. మనం Rational beings గా వుండాలి మొదటే చెప్పానుగా ఈ విషయాలలో జంతువులకి, మనం భేదం లేదని"

"నే నొప్పన్నా.... అవులే, స్త్రీ వ్యభిచరించడం పాపం కాదంటావా?"

"మొగాడు చేస్తే పాపం అంటున్నామా, పెళ్ళాన్ని సరిగ్గా చూడడే మోనని బెంగతప్ప, అవకాశం యివ్వాలి గాని వాళ్ళు నీఅంత మంచివాడిగా నైతిక భవనాలు శాశ్వతంగా నిర్మించగలరు వ్యభిచారం పాపం కాదనను. సంబంధించిన వ్యక్తికి తెలియకుండా వుండేవరకు పాపం కాదు ప్రాణంతో వున్న యే జీవికి నొప్పి కల్గించినా పాపమే. అల్లా అన్యులకి తెలియకుండా వుండేందుకు చేసే ప్రయత్నాలు విఫలం అయినప్పుడు ఘోరాలకింద, విషాదాలకింద జీవనం పరిణమిస్తుంది. అసలు ఓమర్ ఖయ్యామ్ సిద్ధాంతం మంచిది. ఉన్న నాలుగురోజులు స్త్రీలు, పానీయం, వెన్నెలరాత్రుళ్ళు. నీతి తాలూకు Nonsensical talk కి Goodbye,

Please. ఇంగ్లీషులో సామెతుంది.... బ్రహ్మచారి భార్యలు, కన్యల సంతానం మాత్రం చాలా గొప్ప నేర్పరులు— అని".

"నన్ను పెండ్లి చేసుకోటాని కిష్టపడుతుందా?"

"అదంతా నే యేర్పాటు చేస్తాగా, నీకు ఆస్తి యేమాత్రం వుంది?"

"ఏదో మూడువంద లెకరం".

"That setties it. పెళ్ళయిందన్నమాట. ఈ రోజుల్లో చదువుకున్న పిల్ల I.C S. ఉద్యోగి పెండ్లామో, ఇంగ్లండు వెళ్ళేందుకు సామర్థ్యం వున్న Highminded dunce కి భార్యో అవడమేగా"

"అవుతే వర్మా— నీకింత జ్ఞానం వుండి, వెధవ హోమియో వైద్యం చేస్తున్నావే"

"అదే, డబ్బులేక, లేకపోతే ఇంగ్లండు వెళ్ళి ఓ అరడజను మందిని కట్టుకు రాకపోయేవాణ్ణేనా— సరే Goodbye–Goodbye గౌరీ."

## 4

పెండ్లి చేసుకున్న తరవాత చదువుకున్న క్రొత్త భార్యతోను, గౌరీతోనూ, పిల్లాడితోనూ, వర్మ వుపన్యాసాలతోను పాణి జీవనం హాయిగా సాగిపోతోంది, అన్నీ తన యిష్టానుసారంగా వున్నాయికాని గౌరీనిచూస్తే కళ్యాణికి కిట్టకపోవడం, వర్మను చూసినప్పుడల్లా గౌరీ మొరగడం పాణికి కొంచెం కష్టం కలిగించాయి. ప్రతినిత్యమూ యేదో వొంకని కళ్యాణి వర్మ ఆసుపత్రికి షికారుగా వెడుతోన్నప్పుడు గౌరికూడా రాబోతుంటే రానిచ్చేది కాదు. ఒకరోజు పాణి కుర్చీకింద గౌరి పరుండగా కళ్యాణి లోపలి కొచ్చింది. గౌరి లేచి తోక ముడుచుకుని అవతలి కెళ్ళిపోయింది.

"దానికి నువ్వంటే యెందుకంత భయం."

Dirty dog మురికికుక్క పోనిద్దురు. మనం వేసంగిలో బెంగుళూరు వెళ్ళేటప్పుడు మాత్రం దాన్ని తీసుకు రాకండి. అంతా నవ్వుతారు"

"వర్మని చూసినప్పుడల్లా మొరుగుతుంది. చూశావా...." అన్నాడు నవ్వుతూ.

"చూశా.... ఊరకుక్కను అతిధిని సత్కరించటం తెలుస్తేగా. ఇవ్వాళ ఫ్లైనల్ స్వెట్టర్ తెప్పించా పిల్లాడికి...."

"మరి నా గౌరికో—"

"మీకోటు ఒకటి కప్పండి"

## 5

క్రిష్టమస్ సెలవులకు పట్నం; వేసంగికి బెంగుళూరు, ఊటీలు వెళ్ళడం ప్రతిసంవత్సరం జరుగుతున్నాయి. ఈ పట్నాలలో వుండే స్వేచ్ఛాజీవనం: మొగా ఆడ వివక్షత లేకుండా వుండే మర్యాద; ముఖ్యంగా స్త్రీల అలంకారం, కులాసా సంభాషణలు చూచింతర్వాత పాణికి ఆనందం యెక్కువయింది తను యిల్లాంటి భార్యని పెండ్లాడడంలో మంచిపని చేశానని గర్వించాడు వర్మతో స్వేచ్ఛావిహారాలు, తన ఆనరరీవుద్యోగం, కావలసినంత ధనం— యింకేం కావాలి. అతను పూర్తిగా సంతృప్తి చెందాడు. ఒకసారి సెలవులకు బెంగుళూరు నుంచి వచ్చిన వారంరోజుల కోనాడు పాణి తన భార్య కొన్న సీమకుక్కని చూస్తూ కూర్చుండగా గౌరి కుంటుకుంటో లోపల ప్రవేశించింది దాని నోట్లో వున్న కాగితపు ముక్క తీసి చదివాడు.

"నిన్నరాత్రి 8-30 గంటలకు నువ్వు యింట్లో లేవు. ఎంత కష్టపడితే ఆ సమయానికి రాగలిగానో నువ్వు గ్రహించి ఇవాళనైనా నన్ను మాయ చెయ్యవని తలుస్తా.

— ప్రియకళ్యాణి"

పాణి కాళ్ళుచేతులూ చల్లబడి కుర్చీలో వెనక్కి వొరిగిపోయాడు. గౌరి కుంటికాలితోనే అతని వొళ్ళో కెక్కి ముడుచుకుని పరుంది.

o o o

ఆనాటి నుండి ప్రతిదినం 8-30 గంటలన్నమాట. తన మాటలలో నేర్పుగా యిముడుస్తూ భార్యని దెప్పుతూనే వున్నాడు పాణి. కళ్యాణికూడా అనుమానించ సాగించింది. గంటలుకూడా యెట్లా తెలిసాయా అని.

ఇది జరిగిన రెండు నెల్లకి గౌరి యీనింది. అది పెట్టిన మూడు పిల్లలలోను రెండు చచ్చిపోయాయి. ఆ రోజల్లా మబ్బు, వానగా వుంది. పగలల్లా చక్రపాణికి గౌరి కనిపించలేదు. రాత్రి ఎనిమిది గంటలకు కళ్యాణి భోజనానికి పిలిచింది.

"ఇంకా ఎనిమిదన్నర కాందే...." అన్నాడు దెప్పినట్లుగా.

"అదే వద్దన్నాను. నాకర్థం కావడంలేదు మీ మాటలు. ఎందు కొచ్చిన సనుగుడూ, ఇది."

"నీకే తెలుసు. ఐతే వర్మ యీమధ్య మనింటికి రావడంలేదే?"

"ఎందుకొస్తాడు గతిలేకనా? మీరు వొట్టి అనుమానం మనిషని ఆతను తెలుసుకున్నాడు."

"అల్లాగా....పోనీ. ఇవాళ ప్రొద్దున్ననించీ గౌరీ కనిపించటంలేదే."

"ఏమో ఎవరిక్కావాలి వెధవకుక్కగొడవ. ఎవర్నికరుస్తే ఎవరు చావగొట్టారో...."

"వెధవకుక్కంటున్నావ్, నీకంటె తీసిపోదులే."

"చాల్లెండి. నాకూ ఆత్మగౌరవం వుందని మీరు గ్రహించాలి. ఇల్లాగైతే నేను పుట్టింటికి సెలవు తీసుకుంటాను...."

"ఎందుకొచ్చిన వేషం యిది. ఆత్మగౌరవంట ఆఖరికి నీరహస్యం కుక్కకికూడా తెలిసింది"

"రహస్యమేమిటి—మాటలు ఆలోచించుకొని మాట్లాడండి...."

"ఇంకెందుకు దొరికిపొయ్యావులే...."

"నారహస్యాలు కుక్క మీతో చెప్పింది. మీరు నమ్మారన్నమాట. అందుకనా దాన్ని పెంచింది. అందుకనా యిదివరకు దానికి వర్మంటే యెందుకంత కోపమని అడిగారు. మాబాగా అయిందిలెండి. అందుకనే దాన్ని ఊళ్ళోవారెవరో కొట్టి చంపారు."

"ఆ. ఆ. నిజమే, నువ్వు చూశావా....చెప్పు నువ్వు దాన్ని చంపావా లేదా-దాన్ని తోలేశావా లేదా...."

"నాకు తెలీదు...."

"ఏరా, రాజూ" అని తనపిల్లాడిని కేకవేసి "నువ్వు చెప్పు మధ్యాహ్నం మీ అమ్మతో వెళ్ళావుగా....గౌరిని యేం చేసింది?" బుజాలట్టుకుని వూపుతూ అడుగుతాడు.

"నే చెప్పను"

"నీకు తెలుసునన్నమాట. చెప్పుతావా? చెప్పవా?"

"చెప్పను, చెప్పను" పాణి లాగి దవడమీద లెంపకాయ అంటించాడు. పిల్లాడు రాగాలు—గౌరిపిల్ల చిన్ని మొరుగుడు ఓసారే జరిగాయి. రాజు నెత్తుకుని చిన్నిని తాపుతన్ని ప్రక్కగదిలోకెళ్ళి కళ్యాణి గొళ్ళె మెట్టుకుంటుంది.

పాణి కష్టాలు ఆ రోజు నుండి యెక్కువై పోయాయి. ప్రతిభర్త తన జీవితంలో యేదోవొక సమయంలో, తన భార్యపై అనురాగం గోల్పోడం కాకుండా అదియేమైనదీ కూడా అక్కరలేని స్థితికి వస్తాడు. గృహస్థు ధర్మాచరణ నిమిత్తం భార్యకి పోషణ మాత్రం జరుపుతాడు అంతకంటె ఆమె యెక్కడికి పోయినదీ అతనితో యెంతవరకూ అనుకూలంగా వున్నదీ అతను తెలుసుకోవలసిన విషయాలు కావని యెంచుకుంటాడు. ఇప్పుడు చక్రపాణి ఆ స్థితికొచ్చాడు. భార్య పుట్టింటి కెళ్ళిపోయింది. ఆశ్చర్యమైన సంగతేమిటంటే తన ద్వారా మొదటి భార్యకి పుట్టిన రాజు సవతితల్లిపై తననుకూడ ధిక్కరించేటంత ప్రేమ చూపడం, ఆమె యెట్లా చెపితే అట్లా చెయ్యడం, భార్య తనకు చేసే ద్రోహాలలో పాల్గొంటూ యితను ప్రశ్నించినా చెప్పకపోవడం—పాణికి చాలా విచారం కలిగించాయి. ఐనా రాజు కుర్రవెధవ. వాడికేం తెలుసు? ఏవో తినేందుకు వొస్తువులు పెట్టి ప్రేమతో మాస్తే ఎవరేది చెపితే అదే చేస్తాడు. ఎంత ప్రయత్నించినా పిల్లలవిషయంలో స్త్రీ చూపినంత ఆదరణగాని, ద్వేషంగాని పురుషుడు చూపలేడు. రాజునికూడా తనవలలో వేసుకున్న కళ్యాణి సామర్థ్యానికి పాణి ఆశ్చర్యపడ్డాడు. వెళ్ళేప్పుడు తనతో కూడ రాజుని తీసుకు వెళ్ళిపోయింది.

వీటికితోడు కుక్క చేసిన యేదో స్వల్పకార్యంవల్ల అనుమాన పడి భార్యను నానాబాధలు పెట్టి లేవగొట్టాడని పాణిపై వూళ్ళో పుకారు బైలుదేరింది. తుదకు పిల్లాడిని కూడా క్రూరంగా చూడడంవల్ల పాపం సవతితల్లయినా ఆదరించి తనతో తీసుకుపోయిందని కూడా కొందరు చెప్పుకున్నారు. వీటికితోడు చాలా యేండ్లనుంచి కోర్టులో వున్న తీర్పు అతని కెదురుపక్ష మవడంచేత వొందెకరాలు కూడా పోయాయి. ఇవిల్లా వుండగా వర్మ పాణికుక్క చిన్నికి పిచ్చెత్తిందని అది అతన్ని కరిచిందని నేరంమోపి కేసుపెట్టాడు. అది దురదృష్టంవల్ల ఋజువయి దానిని సమాళించుకునేందుకు చాలా ధనం వ్యయమయింది. వీటివల్ల మనోవ్యాధి అధికమై పాణి మంచమెక్కాడు. మందులకొరకు చాలా ధనం వ్యయమైంది. తప్పనిసరయి, అమాయకుడు పాణి వర్మకోసం కబురుపంపాడు. జబ్బు అధికమయిందన్న వుత్తరం చూచుకొని కళ్యాణికూడా ఆరోజుననే వచ్చింది. వర్మ చేయిచూచి యేవో మాత్రలిచ్చే వెళ్ళిపోతూ గుమ్మందాకా నడిచాడు.

"వర్మా!" అని పిలిచాడు పాణి.

"పాణీ! నువ్వు భార్యనుగురించి అనవసరంగా బెంగపడుతున్నావ్. నువ్వు జీవితంమీద దృష్టి మార్చుకోవాలి ....కట్టుబాట్లను, బంధనాలను త్రెంపుకోవాలి."

"కాని, వర్మ"-నువ్వు నామీద పెట్టినకేసు."

"పొరపాటు....Accidental"

వైద్యుడు వెళ్ళింతరవాత కళ్యాణి భర్తదగ్గర కొచ్చింది.

"మీరు వర్మ యిచ్చిన మందు త్రాగవద్దు—మీరు యేమనుకుని అతన్ని పిలిపించారు. మందులో విషం కలిపితే నే చేయించా ననడానికా.. తాగవద్దు." అని ఆ మాత్రలసీసా అటకమీదికి విసిరేసింది.

## 6

ఆరాత్రి పదిగంటలకు పాణి మేడపైన నిద్రపోతున్నాడు. చిన్ని అతని మంచంమీదికి దూకి మూలుగుతో యేడుస్తున్నట్లుగా మొరుగుతూ తనతో రమ్మన్నట్లు గోలచేస్తుంది. మేడక్రింద అరగంటనుండి చిన్ని

మొరగడం తలుపుచెక్కని గిరేశబ్దం అతనికి నీరసంగా వినిపించాయి. మెల్లగా లేచి చిన్నితో గూడా మెట్లుదిగి వీధిగది తలుపు ప్రక్కన నిలబడ్డాడు.

"కాదు, వర్మా! సినిమాల్లోకి వెళ్ళినా ముందు మనకి ధనం అవసరం. బ్రతికివుంటేనే ఎల్లాగో అల్లాగ మనం లాగవచ్చు."

"....రాజు మనవాడే...."

"....కాదు, వ్యాజ్యంవేస్తే మేలు, స్త్రీ పెట్టిన కేసు సులభంగా నెగ్గుతుంది...."

"చాలా అమాయకుడులే....దానికి సందేహం లేదు....చిన్నితో ఆడుకోడం తప్ప వేరుగొడవ లేదు కదా...."

పాణికి కాళ్ళుచేతులు వొణికిపోతున్నాయి. చిన్ని కూడా మొరిగింది. తలుపులు తీయపడ్డాయి. వర్మ మాట్లాడుతున్నాడు.... "పాణీ! నువ్వు లేవకూడదు. నేనూ, నీ భార్య విన్ను కాశ్మీరదేశం తీసుకెళ్ళే విషయం ఆలోచిస్తున్నాం...."

"ఈను తక్షణం నా యిల్లు వదిలి అవతలి కెళ్ళు.... కావాలంటే కళ్యాణిని కూడా తీసుకుపో...."

చిన్ని మొరుగుతూ వర్మని కరవబోతుంది. కళ్యాణి దాన్ని బల్ల మీదున్న దీపంతో కొడుతుంది. కాని దెబ్బ తగలదు, దీపం బ్రద్దలయి గదంతా చీకటవుతుంది. ప్రపంచంమీద కోపమొచ్చినట్లు మొరిగే చిన్ని అరుపు, మినుగుడు వురుగు చేసే కాంతివంతమైన అర్థంలేని రొద, వోపిక లేనట్టుగా కురిసే వర్షం తప్ప జీవంతో వున్న వ్యక్తుల అలజడి లేదు.

## 7

కళ్యాణి పిల్లాడిని తీసుకొస్తానని మళ్ళా పుట్టింటి కెళ్ళింది. ప్రతి మానవుడికి అనుభవంవల్ల ప్రపంచంలో కష్టసుఖాల బాధ్యత వహించవలసిన అవసరంలేదని తన వల్ల తనకుగాని సంఘానికిగాని జరగబొయే వుపకారం లేదని గ్రహించిన స్థితి వస్తుంది. చక్రపాణికి తను జీవించి వుండవలసిన ఆవశ్యకత కనుపించలేదు కుటుంబిగా కాని, దేశీయుడుగా

కాని తాను నెరవేర్చవలసిన కృత్యం అతనికి కనపడలేదు. అట్టిస్థితిలో మనస్సుకాని, ఆత్మకాని, హృదయంకాని నిబంధనలతోను, నేరాలతోను తన్ను బాధించడం మానివేసి వాటిని పలకరించవలసిన అవసరంకూడా తోచలేదు. శరీరంమాత్రం దానికి కావలసిన అవసరాలతో బాధించడం మాత్రం అతనికి మిగిలింది. ఆశరీరాన్ని యివాళ నిర్మూలంచేద్దామని నిశ్చయించుకుని తలుపేసుకుని పగిలిపోయిన అద్దంగల కిటికీముందు కూర్చుని విషం తాగటానికి సంకల్పించుకున్నాడు. పోనీ జరిగిన తప్పులను మన్నించి క్షమించైనా భార్యతో పోరాటాలు లేకుండా అన్యోన్యంగా వుండడానికి మనస్సుని స్వార్థాన్ని చంపుకున్నా భార్య యిదివరలా కాకుండా సరిగ్గా ప్రవర్తిస్తుందన్న నిజమెక్కడిది? పాశ్చాత్యదేశాలలో అరవయ్యేళ్ళ వయస్సుగల స్త్రీకూడా మరోమారు ప్రేమించి ఆ ప్రేమ కోసం సర్వం త్యాగం చేసిన విషయం వర్మ చాలాసార్లు చెప్పాడు పోనీ ఆవూరునుంచి మరోవూరు పోయి వుందామంటే అక్కడ వర్మ జోటిగాడు మరొకడు కనిపించకూడదూ! పోనీ పిల్లాడిని చూసి ముచ్చట పడదామన్నా వాడు మొదలే తనకి శత్రువుగా మారిపోయాడు. బ్రతికినా, చచ్చినా తనకి మిగిలివున్న ఆస్తికోసం కాచుకుని కూర్చున్నారు భార్యాపుత్రులు. ఆత్మగౌరవం, కుటుంబహోదా, సంఘమర్యాద మొదలే పోయాయికదా. చచ్చిపోయిం తర్వాత మనము యేమవుతామన్న కుతూహలం తప్ప బ్రతికియున్న ప్రాణికి జీవితంలో వేరు వుత్సాహం కనిపించలేదు.

తెగుతెంపులేకుండా ఆలోచిస్తూ తన జీవితగాధలో వినోదకరమైన ఘట్టాలను స్మరించుకుంటూ చిన్ని గది బైట తలుపురక్కుతూ చేసే చప్పుడుకూడా వినలేక పోతున్నాడు. ఈవిశాలప్రపంచంలో తనని అర్థం చేసుకుని తన చిన్నిదోషాలను మన్నించి, ప్రేమించి ఆదరించే వ్యక్తి వొక్కడున్నా చాలు....లేదు....అనుకుంటూ సీసా చేతులోకి తీసుకుంటాడు. ఇంతలో యెల్లావొచ్చిందో చిన్నికిటికీఅవతలకు వచ్చి అద్దం పగలడంవల్ల

కల్గిన సందు లోంచి దూకి చేతిలోని సీసామీద పడి పాణివాళ్ళో కూర్చుం టుంది. "చావవద్దు, నాకొరకైనా బ్రతుకు."అన్నట్లుగా అతనివిని నాకుతూ, చాలా ఉత్సాహంగా అతనినుదురు నాకుతూ, తోకాడిస్తూ అతని ప్రాణం రక్షించేందుకొచ్చిన దైవంలా కనిపించింది.

పాణి కన్నీరుకార్చి చిన్నిని యెత్తుకుని మొదటి భార్య చెప్పిన "గౌరికోసమేనా మీరు జీవించాలి" అన్న వాక్కులు స్మరించుకుని "చావ నమ్మా, చిన్నీ! చావను....నీకోసమేనా బ్రతుకుతా...."

కొన్నిగంటలు అందులో యేమన్నా ఆనందం వుంటే అది అను భవించాయి ఆ ప్రాణులు రెండూను. అప్పుడు గ్రహించుకున్నాడు పాణి శరీరంలో ప్రాణం వుండడమే మానవుని ఆశ.... అందుకే అతను సృష్టికి కృతజ్ఞుడై వుండాలని— జీవితానికి శాశ్వతమైనా స్వచ్ఛమైన ఆనంద మిచ్చే వస్తువులు నిజంగా స్వార్థంతో కూడుకున్నవి కావని గ్రంథాలు, బొమ్మలు, ప్రకృతి, కుక్కలాంటి విశ్వాసపూరితమైన జంతువులు, సలహా చెప్పని స్నేహితులు— ఇవి తమస్వార్థాన్ని కోరకుండా, తనకి నిజ మైన సౌఖ్యమిచ్చాయి.... కాని, స్త్రీలు—వాంఛ- కృత్రిమ ద్వేషాలుకావు. కుక్కలకున్న విశ్వాసం మానవులకులేదని కూడా తెలుసుకున్నాడు. అతను తన జీవితంమీద విరక్తిచెంది శరీరం పడేబాధనుండి తొలిగించ టావి కతను గావించదలుచుకున్న ఆత్మహత్య కూడా వొకవిధమైన స్వార్థమే. తను చిన్నివిషయంకూడా మర్చిపోయిన సంగతి అతనికి దాని మీద విశ్వాసంలేదని కూడా తేలుతుంది.

ముఖ్యంగా స్త్రీల విశ్వాసరాహిత్యానికి కారణం తమరు విశ్వా సంలో కుక్కలకంటె మాత్రం మెరుగు అని అనిపించుకోవడం యిష్టం లేకనేమో అనే తలంపువల్ల నవ్వుకుంటూ పాణి సుఖంగా నిద్రిస్తాడు. చిన్నికూడా నిజమేనన్నట్లుగా మూలిగి నిద్రిస్తుంది. ★